పారిశుధ్య నిర్వహణ గాలికి!



కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన రహదారిలో పందుల సంచారం



దయానందనగర్ చాకలి గెడ్డకు వెళ్లే ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్త కుప్పలు

బిజీగా ఉండే అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు

- 10 నెలలు కావస్తున్నా.. కానరాని శానిటరీ ఇన్‌స్పెక్టర్ నియామకం
- ఎక్కడ చూసినా పందులు, చెత్తకుప్పలే దర్శనం
- అవస్థలు పడుతున్న 56వ వార్డు ప్రజలు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డును ప్రజారోగ్య విభాగం అధికారులు పట్టించుకోవడం లేదు. శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించకుండా ఇన్‌చార్జితో నెట్టుకువస్తున్నారు. దీంతో పర్యవేక్షణ కరువైంది. మరి కొన్నిచోట్ల సిబ్బంది ప్రతిరోజూవిధులకు హాజరుకాక పోయినా రిజిస్టర్‌లో చక్కగా హాజరు నమోదు చేస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు.. పందుల స్వైర విహారం కనిపిస్తోంది.

కంచరపాలెం..

కంచరపాలెం పరిధిలోని గొల్లకంచరపాలెం, తోట వీధి, దుర్గానగర్, పల్లివీధి, గోకుల్‌నగర్, గౌరీనగర్, రామూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం, దయానందనగర్, చాకలిగెడ్డ, పైడిమాంబకాలనీ, ముత్యమాంబ కాలనీ, రాజీవ్‌కాలనీ, తదితర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పెద్ద సమస్యగా మారింది. గతంలో ఉన్న 36, 43వ వార్డులను కలిపి 56వ వార్డుగా మార్చారు. ఇంత పెద్ద వార్డుకు 10 నెలలుగా ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో విధులు చేయించడంతో జోన్–5 పబ్లిక్ హెల్త్ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది. అతి ఎక్కువ మురికివాడలు గల 55వ వార్డులో విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు 56వ వార్డు బాధ్యతలు అప్పగించడంతో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కానరాని కార్మికులు.. వేతనాలు ఖాతాల్లో జమ

పారిశుధ్య కార్మికుల బదిలీ, మరణించిన కార్మికుల పేరిట బదిలీ వర్కర్లను నియమించుకునే అవకాశం శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఉంటుంది. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాలనలో అన్నీ అవకతవకలే కనిపిస్తున్నాయి. బదిలీ వర్కర్ల స్థానంలో సర్దుబాటు వర్కర్లను నియమించుకున్నా వారి జాడ కనిపించడంలేదు. విధులకు హాజరవుతున్నట్లు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. వారి వేతనాలు ఎవరి ఖాతాలోకి వెళ్తున్నాయో అని పారిశుధ్య కార్మికులు ఆరోపిస్తున్నారు. బదిలీ వర్కర్ల స్థానంలో క్లాప్ వాహనాల సిబ్బందిని వినియోగిస్తున్నారని వాపోతున్నారు. సిబ్బంది కానరాకపోయినా వేతనాలు డ్రా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిజిస్టర్‌లో పేరు ఉండి విధులకు హాజరుకాని బదిలీ వర్కర్ల పనిని తమ చేత చేయిస్తున్నారని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎందుకంత నిర్లక్ష్యం?

వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను వేరే ప్రాంతానికి బదిలీ చేసి 10 నెలలు గడిచినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు. అర్హత ఉన్న సచివాలయ శానిటరీ కార్యదర్శులను కూడా నియమించకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. జోన్–5 కమిషనర్ దృష్టి సారించి వార్డుకు పూర్తిస్థాయిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను నియమించాలని వార్డు ప్రజలు, కార్మికులు కోరుతున్నారు. అక్రమాలపై విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ఆర్పీ పేట పెతకంశెట్టి అప్పలనరసింహం రహదారి దుస్థితి



బదిలీ వర్కర్లు విధులకు రెగ్యులర్‌గా హాజరు కాకపోయినా రిజిస్టర్‌లో నమోదు చేసిన దృశ్యం

పూడికలమయం...



గొల్లకంచరపాలెం ప్రధాన గెడ్డలో వ్యర్థాలు

వార్డులోని పలు ప్రాంతాల్లో గెడ్డలు పూడికలతో నిండిపోయాయి. పందుల సంచారం, రహదారులపై గుట్టలుగా చెత్తాచెదారాలు దర్శనమిస్తున్నాయి. రోడ్లు, కాలువలు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో పరిసరాలు అధ్వానంగా మారాయి. డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాలు విజృంభించే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూడికలు తొలగించారు





పూడిక తొలగించిన తర్వాత ఇలా.. పిలకవానిపాలెం గెడ్డలో పూడికలు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాల సమస్యపై సాక్షి దినపత్రికలో ఆదివారం గెడ్డలు ఘోరం శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. వార్డు శానిటరీ అధికారి రవి ఆ ప్రాంతానికి సిబ్బందిని తీసుకు వెళ్లి గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపజేశారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

గోపాలపట్నం హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ

గోపాలపట్నం: రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికయ్యారు. ఈ నెల 28 నుంచి 31 వరకు నెల్లూరు జిల్లాలో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించారు. వీటిలో ప్రతిభ చూపిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గోపాలపట్నం హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న కీర్తన, 9వ తరగతి చదువుతున్న సంజన, దుర్గ, భవ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం విద్యార్థినులు, కోచ్, పాఠశాల పీడీలను ప్రధానోపాధ్యాయిని వై.స్వర్ణలత అభినందించారు.

క్లుప్తంగా

ఈవోఐలను వ్యతిరేకిస్తూ ఆందోళనలు

నిర్ణయించిన ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈవోఐలకు వ్యతిరేకంగా మరిన్ని పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించారు. స్టీల్ ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఈ నెల 3న జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో ఈవోఐలకు వ్యతిరేకంగా జగదాంబ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ర్యాలీలో స్టీల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొవాలని నాయకులు కోరారు. అలాగే 9న ఈవోఐలు తెరిచే రోజు స్టీల్‌ప్లాంట్‌లో కార్మికులంతా ఒక గంట టూల్‌డౌన్ పాటించాలని నిర్ణయించారు. 12న అన్ని రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. 16న స్టీల్‌ప్లాంట్‌లో సమ్మె బ్యాలెట్ నిర్వహించాలని నిర్ణయించారు. కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు సీహెచ్. నర్సింగరావు, మంత్రి రాజశేఖర్, జె. అయోధ్యరామ్, డొక్కా నర్సింగరావు, రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, యు. రామస్వామి, వై.టి. దాస్, జి.ఆర్.కె. నాయుడు, సీహెచ్. సన్యాసిరావు, డి. శ్రీనివాస్, శ్రీనివాసరాజు, రాజా, ప్రసాద్ పాల్గొన్నారు.

గ్యాస్ లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



విమాన్‌నగర్ బస్టాప్ వద్ద లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

గోపాలపట్నం: గ్యాస్ బండలు తరలించే లారీని విమాన్‌నగర్ బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎయిర్‌పోర్టు జంక్షన్ వద్ద సిగ్నల్ దాటిన తర్వాత విమాన్‌నగర్ జంక్షన్ వద్ద బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సు ఆగి ఉంది. దీంతో వెనుకగా వస్తున్న గ్యాస్ సిలిండర్లతో వస్తున్న లారీ డ్రైవర్ బ్రేక్ వేశాడు. అయితే దాని వెనకే వస్తున్న 38 నంబర్ బస్సు బ్రేక్ వేసేందుకు డ్రైవర్ ప్రయత్నించినా అదుపులోకి రాకపోవడంతో బస్సు లారీని ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులకు చిన్నచిన్నగాయాలు అయ్యాయని తెలిపారు. క్షతగాత్రులను పోర్టు ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలానికి ఎయిర్‌పోర్టు పోలీసులు వెళ్లి వివరాలు సేకరించారు. ఎవరికీ తీవ్రగాయాలు లేక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.


దైవానుభూతికి సంగీతం ఒక సాధనం



కీర్తనలు ఆలపిస్తున్న సంగీత జనకులం విద్యార్థులు

తాటిచెట్లపాలెం: దైవానుభూతి పొందడమే శాస్త్రీయ సంగీత సాధనకు పరమావధి అని సంగీత జనకులం అధ్యక్షుడు ఇంద్రగంటి కాశీప్రసాద్ అన్నారు. గణపతి నవరాత్రుల సందర్భంగా తాటిచెట్లపాలెం మాస్టర్ ఇ.కె.సంస్కృతి సదన్‌లోని లక్ష్మీగణపతి మందిరంలో సంగీత జనకులం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయ సంగీతంలో సంస్కృతి సదన్‌లో ఇంద్రగంటి రమణీప్రసాద్ వద్ద శిక్షణ పొందుతున్న 30 మంది విద్యార్థులు వాగ్గేయకారులు రచించిన 12 కీర్తనలను వీనుల విందుగా గానం చేశారు. ముఖ్య అతిథి జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సంగీత జనకులం అధినేత కులపతి ఐవీఎల్ శాస్త్రి సంగీత రంగంలో చేసిన సేవలను సత్యదేవ్ ప్రశంసించారు.

వైభవంగా రాధాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్‌లో గల ఇస్కాన్ మందిరంలో ఆదివారం రాధాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని ఆధ్వర్యంలో వేకువజామున వేడుకలు ప్రారంభమయ్యాయి. మంగళహారతి, దర్శనహారతి, హరినామ సంకీర్తన, పంచామృతాభిషేకాలు చేశారు.

వినాయక మండపంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎస్‌ఏడీ ప్రాంతాల్లోని పలు వినాయక మండపాల వద్ద ఆదివారం అన్నదానాలు, రక్తదాన కార్యక్రమాలు నిర్వహించారు. 91వ వార్డు పాత గోపాలపట్నం రామాలయం వీధిలోని వినాయక మండపం ఆవరణలో బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు మాట్లాడుతూ తలసేమియా వ్యాధితో బాధపడుతున్న పిల్లలకు అత్యవసర సమయాల్లో ఉపయోగపడేలా యువకులు రక్తదానం చేశారని తెలిపారు. న్యూలైఫ్ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో 40 యూనిట్ల రక్తం దానం చేసినట్లు చెప్పారు. కార్యక్రమానికి సహకరించిన యువకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ విప్ గణబాబు సందర్శించి యువకులను అభినందించారు. మండపంలో బాల వినాయకుడిని దర్శించుకున్నారు.

పర్యావరణ సేవకులకు వృక్ష మిత్ర అవార్డులు



వృక్ష మిత్ర అవార్డులు అందుకున్న వారితో అతిథులు, ట్రస్టు ప్రతినిధులు

సీతంపేట: వృక్ష మిత్ర కన్నం శ్రీనివాసరావు 26వ వర్ధంతిని పురస్కరించుకుని పర్యావరణంపై పదేళ్లుగా సేవలందిస్తున్న వ్యక్తులు, విద్యార్థులకు వృక్ష మిత్ర కన్నం శ్రీనివాసరావు మెమోరియల్ అవార్డులు ప్రదానం చేశారు. ద్వారకానగర్ గాయత్రి కళాశాల ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులు కృష్ణ యూనివర్సిటీ పూర్వ వీసీ సుంకరి రామకృష్ణారావు, ఏయూ ఎన్విరాన్‌మెంటల్ విశ్రాంత ప్రొఫెసర్ రెడ్డి, ఎస్‌ఎంఎస్ డెంటల్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ శ్రీధర్ మిత్ర, గాయత్రి కళాశాల ఇన్‌చార్జి ఆనంద్‌రావు అవార్డులు అందించారు. గాయత్రి విద్యా పరిషత్ ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి పర్యావరణ సేవలందిస్తున్న ఉత్తమ వలంటీర్లకు కన్నం శ్రీనివాసరావు మెమోరియల్ రికగ్నైజేషన్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఆర్గనైజేషన్ కేటగిరీ నుంచి ఎం.ఎస్.ఎన్. మూర్తి, ఇండివిడ్యువల్ కేటగిరీలో తోటపల్లి శ్యామ్‌కుమార్, ఏయూ రీసెర్చ్ స్కాలర్ కేటగిరీ నుంచి కె.ఎస్.స్వప్న, జీవీఎంసీ స్టూడెంట్ క్యాటగిరీలో బి.అనూష, ఏయూ ఎంఎస్సీ విద్యార్థి జె.సంజయ్ కుమార్‌లు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమాన్ని ట్రస్టు వ్యవస్థాపక కార్యదర్శి కన్నం వెంకటరమణారావు పర్యవేక్షించారు.

బహుముఖ ప్రజ్ఞావంతుడు ఆరుద్ర



ఆరుద్ర శత జయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ఆచార్య బేతవోలు

సీతంపేట: అభ్యుదయ సాహిత్యంలో పరిచయం అవసరం లేని గొప్ప సాహితీమూర్తి ఆరుద్ర అని వక్తలు కొనియాడారు. ఆరుద్ర శత జయంతి సందర్భంగా విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు అధ్యక్షతన ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆరుద్ర సాహిత్య దర్శనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఆచార్య బేతవోలు రామబ్రహ్మం మాట్లాడుతూ ఆరుద్ర గొప్ప పండితుడు, బహుముఖ ప్రజ్ఞావంతుడని, పద్యాలు, వ్యాసాలు, నాటికలు, సినిమా పాటలు, డిటెక్టివ్ నవలలు ఇలా ఎన్నో సాహిత్య ప్రక్రియలు చక్కగా నిర్వహించారన్నారు. ఆరుద్ర ప్రతి విషయాన్ని నిశితంగా పరిశీలించే వారని, ఆయనను కలిసిన ప్రతి సారి ఒక కొత్త విషయాన్ని చెప్పేవారన్నారు. ఇటువంటి సాహిత్య కార్యక్రమాల వల్ల ఆరుద్ర వంటి మహోన్నత వ్యక్తికి న్యాయం చేసినట్టు అవుతుందన్నారు. ఆరుద్ర సినిమా పాటలు రాయడానికి ముందు మద్రాసులో మిలటరీ బ్యాండ్‌లో చేరారని, దానివల్ల మ్యూజిక్, ట్యూన్‌పై మంచి అవగాహన పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆరుద్ర సినీ సాహిత్యంపై రాంభట్ల నృసింహశర్మ రచించిన సమగ్రాంధ్ర సాహితీ సముద్ర ఆరుద్ర శత జయంతి ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఆరుద్ర పాడిన పలు సినీ పాటలను రాంభట్ల ఆలపించి సభికులను అలరించారు. ఆరుద్ర ప్రముఖ రచనల్లో త్వమేహం పై ప్రయాగ సుబ్రహ్మణ్యం, సమగ్రాంధ్రా సాహిత్యంపై డి.రాంబాబు ప్రసంగించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర పూజ జరిపారు. ఉభయదాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ సత్య శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం అందించారు.

ప్రత్యేక పూజలు.. అన్నసమారాధనలు



62వ వార్డులో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు



మల్కాపురం గొల్లవీధి వద్ద పూజలో పాల్గొన్న భోగవల్లి



గోపాలపట్నం వుడా కాలనీ మండపంలో వినాయకుడిని దర్శించుకుంటున్న గణబాబు

మల్కాపురం: వినాయక నవరాత్రి ఉత్సవాలను పారిశ్రామిక ప్రాంతంలో అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. పలు వినాయకుని మండపాల వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు, అన్నసమారాధనలు ఏర్పాటు చేశారు. 58వ వార్డు పిలకవానిపాలెంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ప్రభుత్వ విప్ గణబాబు కుమారుడు మౌర్య సింహ,వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను దర్శించుకుని అన్న సమారాధనను ప్రారంభించారు. 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి వద్ద యాదవ యూత్ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో ఇంటక్ జిల్లా కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు మహేష్‌యాదవ్ నూనెల పాల్గొని పూజలు చేశారు. ఇదే వార్డు గాంధీజీవీధి వద్ద స్థానిక యువకుల ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో మల్కాపురం సీఐ గొలగాని అప్పారావుయాదవ్ పాల్గొన్నారు. అన్న సమారాధననుఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో గాంధీజీ వీధి యంగ్ యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

62, 63 వార్డుల్లో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో దుర్గా యూత్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో, త్రినాథపురంలో హనుమాన్ యూత్ డీసెంట్ బాయ్స్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన భారీ అన్నసమారాధనలను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఎన్ని దానాలు చేసినా రాని సంతృప్తి కేవలం అన్నదానం చేసినప్పుడు మాత్రమే వస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 63వ వార్డు చింతల్లోవలో అగురు యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనను మౌర్యసింహ, 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా ప్రారంభించారు. పరిసర ప్రాంతాల ప్రజలు అన్నప్రసాదాలు స్వీకరించారు.

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వుడా కాలనీలోని వినాయక మండపంలో స్వామిని ప్రభుత్వ విప్ గణబాబు దర్శించుకున్నారు. అనంతరం జరిగిన అన్నదానంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల జీవనోపాధికి గండి



నిరసన తెలుపుతున్న ఆటో, మ్యాక్సీ క్యాబ్‌ల డ్రైవర్లు, యూనియన్ నాయకులు

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోలు, వ్యాన్‌లు, జీపు డ్రైవర్ల ఉపాధికి గండి పడిందని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి అన్నారు. ఫ్రీ బస్ పథకంలో ఆదాయం కోల్పోయిన డ్రైవర్లకు ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించాలని డిమాండ్ చేస్తూ అక్కయ్యపాలెం హైవే కూడలిలో ఆదివారం డ్రైవర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటి ప్రభుత్వం వచ్చాక ఇంధనం, నిత్యావసర సరకులు, వాహన విడి భాగాల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. దీనికి తోడు పెంచిన జరిమానాలు ఆటో డ్రైవర్లకు కునుకు లేకుండా చేస్తున్నాయని తెలిపారు. ఉబర్, ర్యాపిడోతో ఇప్పటికే 40 శాతం ఆటో డ్రైవర్లకు ఉపాధి పోయిందని, చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన ఉచిత బస్సు ప్రయాణంతో మరో 30 శాతం నష్టపోయామన్నారు. ఆటో డ్రైవర్ల ఉపాధికి నష్టం కలిగించే ఉబర్, ర్యాపిడో అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించిన ఎన్నికల హామీని తక్షణం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రవికృష్ణ, కేలం శివ, కె.నూకరాజు, జి.నందీశ్వరరావు, శంకర్, సిహెచ్.శ్రీనివాసరావు, వి.సన్యాసిరావు, నర్సింగ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలు



క్షతగాత్రులు ఉదయ్, రాజేష్‌లకు సహాయం చేస్తున్న వాహన చోదకులు

అల్లిపురం: తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌పై ఆదివారం సాయంత్రం 4 గంటలకు ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం, పాత ఐటీఐ జంక్షన్‌కు చెందిన ఉదయ్ కార్పెంటర్‌గా, రాజేష్ మెకానిక్ వర్కర్‌గా పనిచేస్తున్నారు. వీరు ఆదివారం మధ్యాహ్నం ఆర్కే బీచ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదానికి గురయ్యారు. సంపత్ వినాయక గుడి నుంచి రైల్వే స్టేషన్ వైపు వెళ్తుండగా డివైడర్‌ను గుద్దుకుని పడిపోయారు. వీరిలో ఉదయ్‌కు ముఖం, చెంపలపై తీవ్ర గాయాలయ్యాయి. రాజేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న వారు వారిని చూసి పోలీసులకు సమాచారం అందజేశారు. వారిని ఒక ప్రైవేట్ కారులో ఆస్పత్రికి తరలించారు. వైద్యులు క్షతగ్రాతులను చికిత్స అందజేస్తున్నట్లు టూ టౌన్ ట్రాఫిక్ ఎస్ఐ శ్రీలక్ష్మి తెలిపారు.